క్లుప్తంగా

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

కోడూరు: మండలంలో దొంగతనాలు, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్ఐ చాణిక్య తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వేసవి సెలవులు రానున్న నేపథ్యంలో తీర్థయాత్రలు, శుభకార్యాలు, ఇతర ప్రాంతాలకు ఇంటికి తాళాలు వేసి వెళ్లేవారు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంట్లో విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు లేకుండా బ్యాంక్ లాకర్లలో పెట్టుకోవాలని చెప్పారు. అన్ని దుకాణాలు, దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద సంబంధిత నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో సీసీ రోడ్డు నిర్మాణం



మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి బస్‌స్టాండ్‌లో ఎట్టకేలకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామస్తులు, ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు అవనిగడ్డ డీఎం హనుమంతరావు ఆర్టీసీ నిధులు రూ. 6 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ స్థానిక శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులు, ప్రయాణికుల సౌకర్యార్థం సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు బస్‌స్టాండ్‌లోని మరుగుదొడ్లు బాగుచేయించినట్లు తెలిపారు. బస్‌స్టాండ్‌లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆర్టీసీ ఏఈ సుభాని, గుత్తేదారు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

గూడూరు: గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీ రాజేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

సీఐఎస్ఎఫ్ ర్యాలీ



కృత్తివెన్ను: దేశంలో సెంట్రల్ ఇండ్రస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) ప్రారంభించి 56 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఫోర్స్‌కు సంబంధించిన ప్రతినిధుల బృందం కృత్తివెన్ను మీదుగా భారీ ర్యాలీగా వెళ్లారు. గురువారం కృత్తివెన్నుకు వచ్చిన బృందానికి ఎస్ఐ పైడిబాబు స్వాగతం పలికి వారికి అల్పాహారాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ ర్యాలీ కోల్‌కతా నుంచి ప్రారంభమై కన్యాకుమారి వరకు సాగుతుందని తెలిపారు. దేశంలో ప్రజలు మత్తు పదార్థాలకు బానిసలుగా మారకూడదని, తీరప్రాంత రక్షణ, పరిరక్షణ, మహిళలపై అఘాయిత్యాలు, ఆడపిల్లల అక్రమ రవాణా మొదలైన అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. బంటుమిల్లి, పెడన మీదుగా ర్యాలీ సాగుతుందని పేర్కొన్నారు.

పన్నుల వసూళ్లలో పెడన టాప్

- గత ఏడాది కూడా జిల్లాలో ప్రథమ స్థానం
- ఇప్పటికే 55.48 శాతం వసూళ్లు



పెడన పురపాలక సంఘ కార్యాలయం

పెడన: సచివాలయాల ఉద్యోగుల రాకతో పన్నుల వసూళ్లు వేగవంతమయ్యాయి. గతంలో పన్ను వసూళ్లు సక్రమంగా జరగక బకాయిలు పేరుకుపోతూ వచ్చాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడంతో ఆస్తి పన్ను, నీటి పన్నుల వసూళ్లు వేగవంతమయ్యాయి. 2023–24 ఆర్థిక సంవత్సరం ముగియడంతో జిల్లాలోని ఒక కార్పొరేషన్‌తో పాటు నాలుగు పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను, నీటి పన్ను వసూళ్లలో పెడన పురపాలక సంఘం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది కూడా అంటే 2024–25లో కూడా పెడన పురపాలక సంఘం టాప్‌లో దూసుకుపోతోంది.

ఆస్తి పన్ను వివరాలు ఇలా..

2024–25 ఏడాదికి సంబంధించి జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో పరిస్థితిని పరిశీలిస్తే.. వైఎస్సార్ తాడిగడప పురపాలక సంఘంలో రూ. 27.60కోట్లు వసూళ్లు కావాల్సి ఉండగా రూ. 20.01కోట్లు వసూళ్లయ్యాయి. అంటే 72.49 శాతం నమోదైంది. అయితే అధికారికంగా ఇక్కడ అసెస్‌మెంట్లు డిమాండ్‌ను ఫిక్స్ చేయకపోవడంతో ఎంత శాతం అనేది స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. కారణం పురపాలక సంఘం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఆస్తి పన్నులు పంచాయతీల నుంచి పురపాలక సంఘానికి బదలాయింపులో సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో తాడిగడప పురపాలక సంఘంలో పన్నులు వసూళ్లు చేస్తున్నా లక్ష్యాలను నిర్దేశించలేని పరిస్థితి ఏర్పడింది. ఇక మచిలీపట్నం కార్పొరేషన్‌లో రూ. 33.69కోట్లకు రూ.11.76కోట్లు మాత్రమే వసూళ్లయ్యాయి. దీంతో మచిలీపట్నం కార్పొరేషన్‌లో 34.91 శాతంతో వెనుకంజలో ఉంది. గుడివాడ పురపాలక సంఘంలో రూ. 16.73కోట్లకు రూ. 9.27కోట్లు వసూలు చేసి 55.38 శాతంతో రెండో స్థానంలో ఉంది. ఉయ్యూరులో రూ. 6.15కోట్లకు రూ.3.31కోట్లు వసూలు చేసి 53.84 శాతంతో మూడో స్థానంలో కొనసాగుతోంది. పెడన పురపాలక సంఘంలో రూ. 2.18కోట్లకు గానూ రూ.1.21కోట్లు వసూలు చేసి 55.48 శాతంతో జిల్లాలో ప్రథమస్థానంలో దూసుకుపోతోంది.

నీటి పన్నుల్లో కూడా

పురపాలక సంఘాల్లో నీటి పన్నుల వసూళ్లలో కూడా జిల్లాలో పెడన పురపాలక సంఘం ప్రథమస్థానంలో కొనసాగుతోంది. పెడన పురపాలక సంఘంలో రూ. 69లక్షలకు రూ. 29.03లక్షలు వసూళ్లు చేసి 42.10 శాతంతో ముందంజలో ఉంది. ఉయ్యూరు రూ. 75.13లక్షలు ఉండగా రూ.28.20లక్షలు వసూళ్లు 37.50 శాతంతో ద్వితీయ స్థానంలో కొనసాగుతోంది. గుడివాడ ఈ ఏడాది రూ. 4.27కోట్లకు గాను రూ. 1.22కోట్లు వసూళ్లు చేసి 28.60 శాతంతో మూడో స్థానంలోనూ, మచిలీపట్నం కార్పొరేషన్ రూ. 14.37కోట్లకు రూ.3.34కోట్లు వసూల్లు చేసి 23.30 శాతంతో జిల్లాలో చివరిస్థానంలో ఉంది.

ప్రత్యేక డ్రైవ్



పెడన పురపాలక సంఘంలో 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి కూడా పన్నులపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది. సచివాలయ ఉద్యోగులు, పురపాలక సిబ్బంది ద్వారా వసూళ్లు చేశాం. ఆర్థిక సంవత్సరం చివరి నెల మార్చిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సెలవు రోజుల్లో కూడా వసూళ్లు చేయడం జరుగుతోంది. ఏప్రిల్ మొదటి వారంలో ఎవరు అధికంగా వసూళ్లు చేసి ఏ స్థానాల్లో నిలిచారనేది స్పష్టమవుతుంది.

పామర్తి వెంకటేశ్వరరావు,
ఆర్ఐ, పురపాలక సంఘం, పెడన

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు



వేములపల్లిలో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎంపీడీవో సుబ్బారావు, తహసీల్దార్

తెలుగురావుపాలెం(ఘంటసాల): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో డీ సుబ్బారావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ బీ విజయప్రసాద్‌తో పాటు ఇతర మండలస్థాయి అధికారులు గురువారం ఘంటసాల మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ వేములపల్లి ఎస్సీ కాలనీలో మురుగు నీరు పారుదల సమస్య, రోడ్డు ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో పర్యటించి మండల సర్వేయర్‌ను సర్వే చేసి సమ్యను పరిష్కరించాలని ఆదేశించారు. శ్రీకాకుళం గ్రామంలో బాణావతి వెంకటరమణ పొలంలో రోడ్డు మార్గం ఆక్రమణకు గురైందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వారితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి అవసరమైన సూచనలు సర్వేయర్, వీఆర్వోలకు తెలిపామని చెప్పారు. తెలుగురావుపాలెం గ్రామంలో చెరువు ఆక్రమణకు గురైందని వచ్చిన ఫిర్యాదు మేరకు మండల సర్వేయర్‌ను చెరువు సరిహద్దు మార్కింగ్ చేయాలని సూచించినట్లు చెప్పారు. చినకళ్లేపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో మురుగునీరు పారుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శికి సూచించినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో తెలుగురావుపాలెం, చినకళ్లేపల్లి సర్పంచులు రాచూరి ప్రసాద్ బాబు, గుత్తికొండ రాము, ఈఓపీఆర్డీ కే వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ వల్లీపుష్ప, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సురేష్, శ్రీనివాసరావు, అశ్విన్, అబ్దుల్ నయీమ్, వీఆర్వోలు గోపి, మనీషా, కోటేశ్వరరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై జనసేన ఆగడాలు



శ్రీకాకుళం కరకట్టపై దగ్గరుండి పాకలను తొలగిస్తున్న జనసేన నేత

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో నిరుపేద వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన చిరు వ్యాపారస్తులపై జనసేన పార్టీ నేతలు అధికారులను అడ్డుపెట్టుకుని చేస్తున్న ఆగడాలపై నియోజకవర్గ వ్యాప్తంగా చర్చాంశనీయమైంది. శ్రీకాకుళం గ్రామంలో కరకట్ట రహదారికి ఇరువైపుల పదుల సంఖ్యలో చిరువ్యాపారులు, బడుగు జీవులు పాకలు వేసుకుని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే వారిలో ఇరువురు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు కావడంతో జనసేన మండల ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్ దగ్గరుండి మరీ జేసీబీతో షాపులను తొలగించారు. ఒకరు 20 ఏళ్లుగా, మరొకరు అయిదేళ్లుగా రహదారి పక్కన దుకాణాలు పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని బాధితులు తెలిపారు. మిగతా దుకాణాలు వదిలేసి కేవలం వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల దుకాణాలు మాత్రమే కూల్చడం అన్యాయమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మామిడి ఉత్పత్తులతో స్వయం ఉపాధి



శిక్షణలో మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి

అవనిగడ్డ: మామిడి ద్వారా పలు అనుబంధ ఉత్పత్తులను తయారు చేసి మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కోఆర్డినేటర్ డాక్టర్ డీ సుధారాణి తెలిపారు. ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఆదేశాలతో ఘంటసాల కేవీకే ఆధ్వర్యంలో మండల పరిధిలోని బందలాయిచెరువులో మహిళలకు మామిడి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి ద్వారా మామిడి పన్నా, ఆమ్చూర్, మామిడి చాక్లెట్స్, జామ్, ఫ్రూట్ బార్‌లు తయారు చేసుకోవచ్చని సూచించారు. వీటిని తయారు చేసి వ్యాపారం చేయడం ద్వారా ఎన్నో లాభాలు గడించవచ్చని తెలిపారు. గృహవిజ్ఞాన శాస్త్రవేత్త జీ కృష్ణవేణి శిక్షణ కార్యక్రమంలో తయారు చేసిన పలు రకాల ఉత్పత్తులను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వీ మంజువాణి, డాక్టర్ రేవతి, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత హోమ్ డస్ట్‌బిన్‌ల పంపిణీ



నాగాయలంక: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నాగాయలంక గ్రామ పంచాయతీ నిధులతో తడి, పొడి చెత్త వేరు చేసేందుకు గురువారం ఉచితంగా హోమ్ డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. ఈఓపీఆర్డీ కే అప్పల నరసమ్మ పర్యవేక్షణలో సర్పంచ్ కైతేపల్లి అంకాలు నేతృత్వంలో 1,200 కుటుంబాలకు రెండేసి డస్ట్‌బిన్‌లను ఇంటింటికీ అందజేశారు. అనంతరం ప్లాస్టిక్ నివారణపై అవగాహన కలిగించారు. గ్రామస్తులు డస్ట్‌బిన్‌లు, చేతి సంచులు వినియోగించాలని సూచించారు. స్థానిక గ్రామ కార్యదర్శి జరుగు పవన్‌కుమార్, పంచాయతీ వార్డు సభ్యులు ఉప్పల అచ్యుతరామయ్య, పోతార్లంక ఏడుకొండలు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రామ్‌రాజ్ నూతన షోరూం ప్రారంభం



రామ్‌రాజ్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న గోపీచంద్, పక్కన మునిసిపల్ కమిషనర్

మచిలీపట్నంఅర్బన్: నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ షోరూంను గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 43 ఏళ్లుగా భారత దేశపు సంస్కృతి, సాంప్రదాయాల దుస్తులు అమ్మకానికి పెట్టింది పేరు రామ్‌రాజ్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ బాపిరాజు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో 400 పైగా రామ్‌రాజ్ షోరూంలు ఉన్నాయని తెలిపారు. క్లస్టర్ మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ 250 వెరైటీల ధోతీలు, చిన్నారుల కోసం సిల్క్ ధోతీలు, కుర్త పైజమా, వెల్క్రో ధోతీ సెట్స్, జస్ట్ బ్రోస్ సెట్స్, ఫ్యూజన్ షర్ట్స్, అతివల కోసం శారీస్, కాటన్, జుట్, లెనిన్, ఆర్ట్ సిల్క్, టిష్యూ, కొవై కాటన్, పర్ సిల్క్, మగవారికి షార్ట్ లెన్త్, మీడియం లెన్త్, లాంగ్ షర్ట్స్, కాటన్ అండ్ లెనిన్ బ్యాంబు, క్రింకిల్ఫ్రీ, స్టెయిన్ గార్డ్, రెడీమేడ్ సూటింగ్ షర్టింగ్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గడ్డం రాజు, పువాడ రామ్ ప్రసాద్, రంగ, శ్రీధర్, సత్యనారాయణ, ప్రేమ్ చంద్, ఏజీఎం డీ శ్రీనివాసులు, జోనల్ మేనేజర్ పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బెంగాలీషా బాబావలి ఉరుసు



బెంగాలీషా బాబావలి సమాధి

కోడూరు: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పెదగుడుమోటులోని బెంగాలీషా బాబావలి ఉరుసు మహోత్సవాన్ని శనివారం నిర్వహించేందుకు దర్గా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. దివిసీమలోనే పేరుగాంచిన బెంగాలీషా బాబావలి దర్గా వద్ద ప్రతి ఏటా ఉరుసు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శనివారం ఉదయం ఉరుసును ప్రారంభించి, బాబా సమాధికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై చందనోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 23న ఆదివారం ఉదయం దర్గా వద్ద దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. దర్గా ప్రాంగణంలో బాబావలి సమాధితో పాటు ముస్లిం కుటుంబాలకు చెందిన వారి పితృదేవతల సమాధులు కూడా ఉండటంతో ఆయా కుటుంబసభ్యులు ఈ ఉరుసుకు తరలివచ్చి పూజలు చేస్తారు. కులమతాలకు అతీతంగా ఈ ఉరుసు మహోత్సవానికి ప్రతి ఒకరూ తరలిరానున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వమే రివిజన్ చేయాలి

మచిలీపట్నంఅర్బన్: డీఓటీలో పనిచేస్తూ బీఎస్ఎన్ఎల్‌కు నియమించబడిన ఉద్యోగులకు ప్రభుత్వమే పెన్షన్ ఇస్తున్నప్పుడు రివిజన్ కూడా ప్రభుత్వమే చేయాలని ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ వీ వర ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మచిలీపట్నం శాఖ జనరల్ బాడీ సమావేశం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2017 నుంచి రావలసిన పెన్షన్ రివిజన్‌ను బీఎస్ఎన్ఎల్ లాభ, నష్టాలతో ముడిపెట్టి రివిజన్ సమస్యను పరిష్కరించకుండా వదిలేయడంతో ప్రభుత్వంతో న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో 7–8 ఏళ్లు పోరాటం చేయకుండా శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం ముఖ్య సలహాదారుడిగా సీఎస్ఆర్ మూర్తి, అధ్యక్షుడిగా వై నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బీ పూర్ణచంద్రరావు, కార్యదర్శి పీ రంగబాబు, కోశాధికారిగా నందం, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే శ్రీనివాసరావులను నూతన కార్యవర్గంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రభుదాస్, సుబ్బారావు, శ్రీనివాస్(ఏజీఎం), పెన్షనర్స్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆలీవ్ రిడ్లే తాబేళ్ల పరిరక్షణ అందరి బాధ్యత



కోడూరు: సముద్రంలోని వ్యర్థాలు ఇతర మొక్కలను తింటూ సముద్ర కాలుష్యాన్ని నివారించే ఆలీవ్ రిడ్లే తాబేళ్ల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పాలకాయతిప్ప మెరైన్ ఎస్ఐ పూర్ణ మాధురి అన్నారు. గురువారం మండలంలోని ఉల్లిపాలెం, హంసలదీవి, పాలకాయతిప్ప గ్రామాల్లో ఆలీవ్ రిడ్లే తాబేళ్లను సంరక్షించాలంటూ మెరైన్ పోలీసులు ప్రచారం నిర్వహించారు. మత్స్యకారులు వేట సమయంలో వినియోగించే పడవల కింద భాగంలో ఉండే ఫ్యాన్ రెక్కలు తగిలి తాబేళ్ల మృత్యువాత పడుతున్నాయన్నారు. మత్స్యకారులు టేకు వలలు, రింగు వలలు, అప్ప వలలు, మూడు పొరల వలల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. జనవరి నుంచి మే వరకు ఈ తాబేళ్ల గుడ్లు పెట్టే సమయం కావడంతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని ఎస్ఐ కోరారు. అనంతరం మెరైన్ శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన ప్రత్యేక కరపత్రాలను పంపిణీ చేశారు. హెచ్‌సీ రామకృష్ణ, రైటర్ రెహ్మాన్‌జానీ, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా మినుము కాయతీత



యంత్రం సాయంతో మినుము కాయతీత పనులు

కోడూరు: రబీలో రెండో పంటగా సాగు చేసిన మినుము పంట చేతికి రావడంతో అన్నదాతలు కాయతీత పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని ఎగువ ప్రాంతాల్లో రైతులు ఈ మినుము కాయతీతలను కూలీలు, యంత్రాలతో సాయంతో ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికే మాచవరం, వి.కొత్తపాలెం, జయపురం గ్రామాల్లో పంటను కొంతమంది రైతులు ఇళ్లకు తరలించుకోగా లింగారెడ్డిపాలెం, మందపాకల, పోటుమీద, పిట్టల్లంక ప్రాంతాల్లో ప్రస్తుతం ఈ కాయతీత పనులు చురుగ్గా సాగుతున్నారు. అయితే ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా లేదని రైతులు వాపోతున్నారు. పురుగు మందులు, కూలీలకు వేలాది రూపాయిలు ఖర్చు చేసినా ఎకరానికి కేవలం మూడు నుంచి ఐదు బస్తాల దిగుబడి మాత్రమే వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది చీడపీడలు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణమని రైతులు చెబుతున్నారు.

రాయపురెడ్డి శ్రీనివాసరావుకు నివాళి

గూడూరు: పెడన సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన గూడూరు మండలం లేళ్లగరువు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రాయపురెడ్డి శ్రీనివాసరావు భౌతికకాయానికి ఆయన స్వగృహం వద్ద వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము గురువారం నివాళులర్పించారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, బూరగడ్డ శ్రీకుమార్, పర్ణం మహాలక్ష్మయ్య నాయుడు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

లక్ష కట్టుకో.. బెల్టు షాపు పెట్టుకో.!

- గ్రామాల్లో బెల్టు షాపుల ఏర్పాటులో కొత్త విధానం
- చల్లపల్లి మండలంలో 45 బెల్టు షాపులు
- అధికారుల చర్యలు శూన్యం



చల్లపల్లి: నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఊరి చివర, జనావాసాలకు దూరంగా ఉన్న మద్యం షాపులు నేడు కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే వాటిని కాస్తా జనావాసాల మధ్యకు చేర్చారు. మద్యం నిర్వాహకులు మరో అడుగు ముందుకేసి గ్రామ గ్రామాన బెల్టు షాపులు తెరిచేందుకు రేట్లు నిర్ణయిస్తున్నారు. అన్నీ తామే చూసుకుంటామంటూ భరోసా ఇచ్చి మరీ బెల్టు షాపులు పెట్టిస్తున్నారు. బెల్టు షాపులు విచ్చలవిడిగా పెరిగిపోవడంతో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ మందు బాబుల చేష్టలతో గ్రామస్తులు విసుగెత్తిపోతున్నారు.

బహిరంగంగానే మద్యం అమ్మకాలు

మద్యం వ్యాపారులు గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా వ్యాపారాన్ని పెంచుకునేందుకు గేట్లు తెరిచారు. స్టాకు అవసరాన్ని బట్టి రూ. 50వేల నుంచి లక్ష రూపాయల వరకూ డిపాజిట్లు కట్టించుకుని బెల్టు షాపులు ఏర్పాటు చేయిస్తున్నారు. కావలసినంత సరుకును సరఫరా చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. సిండికేట్ అండదండలతో గ్రామాల్లో బహిరంగంగానే మద్యం అమ్ముతున్నారంటే ఏ రకంగా మద్యం ఏరులై పారుతూ ప్రజాజీవనాన్ని అస్తవ్యస్థం చేస్తోందో అర్థమవుతోంది.

11 గ్రామ పంచాయతీల్లో..

చల్లపల్లి మండలంలో మొత్తం 11 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల పరిధిలో ఉన్న ప్రజల నుంచి సేకరించిన వివరాల ప్రకారం మండలంలో మొత్తం 45 బెల్టు షాపులు కొనసాగుతున్నాయి. చల్లపల్లిలో మూడు బెల్టు షాపులు, లక్ష్మీపురంలో–3, మాజేరులో అత్యధికంగా–12(పాత మాజేరులో–3, కొత్తమాజేరులో–9), మంగళాపురంలో–3, వక్కలగడ్డలో–2, యార్లగడ్డలో–3, పురిటిగడ్డలో–5, నడకుదురులో–6, వెలివోలులో–4, పాగోలులో–1, ఆముదార్లంకలో–3 బెల్టు షాపులు ఉన్నాయి. ఈ షాపుల్లో మూడు పువ్వులు ఆరు కాయలుగా మద్యం వ్యాపారం సాగుతోంది.

రూ.50వేల నుంచి 1లక్ష వరకు డిపాజిట్

మాజేరులో ఒక్కొక్క బెల్టు షాపు నిర్వాహకుడు ఒక లక్ష చొప్పున డిపాజిట్ చేయగా, మిగిలిన ప్రాంతాల్లో రూ.50లు చొప్పున డిపాజిట్ కట్టించుకుని మద్యం వ్యాపారులు సరుకు సరఫరా చేస్తున్నారు. డిపాజిట్ కట్టలేని వారు అప్పటికే గ్రామాల్లో ఉన్న బెల్టు షాపుల నిర్వాహకుల అనుమతితో వారి వద్దే కొని సరుకు అమ్ముకోవచ్చు. డిపాజిట్ కట్టకుండా సొంతంగా బెల్టు షాపు నిర్వహిస్తే మద్యం వ్యాపారులే ఫిర్యాదు చేసి వారిని పట్టిస్తుండటం కొసమెరుపు. డిపాజిట్ కట్టిన బెల్టు షాపు నిర్వాహకులను అధికారులు ఎవరైనా పట్టుకుంటే వారిని బయటకు తీసుకువచ్చే బాధ్యత తమదేనంటూ మద్యం సప్లయిదారులు భరోసా ఇస్తున్నారు.

బాటిల్‌పై రూ.10లు అదనం

బెల్టు షాపు నిర్వాహకులకు ఇచ్చే ఒక్కో మద్యం బాటిల్ ఎమ్మార్పీ రేటుపై రూ.10లు అదనంగా వ్యాపారులు వసూలు చేస్తున్నారు. తక్కువ ధరకు బాటిల్స్ తీసుకువెళ్లి బెల్టు షాపుల్లో ఎక్కువ ధరకు అమ్ముతూ కాసులు దండుకుంటున్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపుల ద్వారా బహిరంగంగానే అమ్ముతున్నా పట్టించుకున్న వారే కరువయ్యారు. బెల్టు షాపుల నిర్వాహకులకు ఫోన్ చేస్తే ఏకంగా డోర్ డెలివరీ ఇస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని ఆయా గ్రామాల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

స్వచ్ఛ చల్లపల్లికి లక్ష విరాళం

చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లి కోసం 'మన కోసం మనం' ట్రస్టుకు ప్రవాస భారతీయుడు దాసరి అనుదీప్ గురువారం రూ.1 లక్ష విరాళం ఇచ్చారు. స్వచ్ఛ చల్లపలి రథసారధి డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ సోదరుడైన దాసరి చిన్నాజీ కుమారుడు అనుదీప్ కాలిఫోర్నియాలో ఉంటున్నాడు. విరాళం పంపిన అనుదీప్‌ను స్వచ్ఛ కార్యకర్తలు అభినందించారు.

విఘ్నేశ్వరుడి ఆలయానికి వితరణ

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో నిర్మించిన మండపం అభివృద్ధి పనులకు భక్తులు విరాళాలు ఇచ్చినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడెడ్ల రామారావు, లక్ష్మీరంగ దంపతులు రూ. 51 వేలు, బరిగెల రాధాకృష్ణ, సుజాత దంపతులు రూ. 25 వేలు, అడబాల దుర్గాప్రసాద్, నాగశ్రీ దంపతులు రూ. 10,116 , గంటా చంద్రశేఖర్–ఉష దంపతులు రూ. 10,116, పంచకర్ల వెంకట్, సుమతి దంపతులు రూ. 5,116 స్వామివారికి వితరణ ఇచ్చినట్లు వివరించారు. దేవస్థానం వేద పండితులు వేద మంత్రాలతో దాతలకు ఆశీర్వచనాలు అందజేశారన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి

గుడివాడరూరల్: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువత దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. స్థానిక వన్‌టౌన్ పీఎస్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 22 నుంచి జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లపై యువత తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌తో లక్షలాది రూపాయలు పోగొట్టుకుని అప్పుల పాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని నివారించడానికి పోలీసు శాఖ ఇప్పటికే అవగాహన కల్పిస్తోందన్నారు. ఎవరైనా బెట్టింగ్‌లు, జూదాలు ఆడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.